వైభవంగా వనదుర్గామాత రథోత్సవం

ఆలయంలో భక్తుల రద్దీ, ఇన్‌సెట్‌లో వనదుర్గామాత

ఏడుపాయల్లో రథోత్సవం

- ముగిసిన ఏడుపాయల జాతర
- రంగురంగుల విద్యుత్ దీపాలతో రథ అలంకరణ
- అధికారుల సమన్వయంతో జాతర విజయవంతం

పాన్నపేట, మార్చి10 : అమ్మలగన్న మా యమ్మ.. ఏడుపాయల దుర్గమ్మ.. మమ్మల్ని సల్లంగా చూడమ్మ.. అంటూ దుర్గమ్మ నామ స్మరణలతో ఏడుపాయల గుట్టలు ప్రతిధ్వనించాయి. ఏడుపాయల జాతరలోనే అత్యంత కీలక ఘట్టం రథోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. చివరి రోజు రథోత్సవ కార్యక్రమంలో చీకటిని సైతం లెక్కచేయకుండా వేలాది మంది భక్తులు తిలకించారు. వందలాది మంది భక్తులు రథాన్ని లాగారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఏడుపాయల ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఎండోమెంట్ కార్యాలయం నుంచి డప్పుచప్పులతో వెళ్లి రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని అధికారులను ఎదుర్కొని, అక్కడి నుంచి నేరుగా నాగ్సాన్‌పల్లి చేరుకున్నారు. ఆనవాయితీ ప్రకారం గ్రామ పెద్దకాపును భాజాభజంత్రీలతో ఎదుర్కొని దుర్గమ్మ ఆలయం వరకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి వనదుర్గా భవానీమాత ఉత్సవ విగ్రహాన్ని ఎదుర్కొని రథం గోలి వరకు తీసుకొచ్చారు. గోలి సమీపాన రథం ఎదుట పట్టు పరిచి అన్నం వండి రాసి పోసే కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 18 కులాలకు చెందిన పనిబాటల వాళ్లు పాల్గొన్నారు. అనంతరం దుర్గామాతను వేనోళ్ల పొగుడుతూ జయజయ ధ్వనాలు చేస్తూ, దిక్కులు ప్రజ్వరిల్లేలా ఏడుపాయల గుట్టలు మార్మోమోగుతుండగా రథాన్ని లాగే కార్యక్రమాన్ని రంగోలి ప్రాంతం నుంచి ప్రారంభించారు. రథోత్సవం రాజగోపురం వరకు కొనసాగింది. ఆలయ పరిసరాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా మెదక్ డీఎస్పీ డాక్టర్ రాజేశ్ ఆధ్వర్యంలో భారీగా పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టారు.

జాతర విజయవంతం

ఏడుపాయల్లో భారీసంఖ్యలో భక్తులు వస్తారన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్, జిల్లా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జాతరకు ముందు జిల్లాస్థాయి అధికారులు కలెక్టర్‌తోపాటు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి జాతరను విజయవంతం చేశారు.

శక్తి పీఠంలో మహా మంత్రాహవనం

బగలాముఖి శక్తిపీఠంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

శివ్వంపేట, మార్చి 10: శివ్వంపేటలోని బగలాముఖి శక్తిపీఠంలో ఆదివారం అమావాస్య సందర్భంగా అమ్మవారి ఉపాసకుడు బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి హరిద్రార్చన, మహామంత్రాహవనం, మంత్ర పుష్పం, హోమం నిర్వహించారు. భక్తులు భారీగా వచ్చి మొక్కులు చెల్లించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా, హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్, జిల్లా రిటైర్డ్ డీఈవో జగదీశ్ మంజుశ్రీ దంపతులు, బీఆర్ఎస్ నాయకులు చాగండ్ల నరేంద్రనాథ్, పబ్బరమేశ్‌గుప్తా, ప్రధాన అర్చకుడు సంతోష్‌శర్మ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ పద్మావెంకటేశ్, నాయకులు పోచాగౌడ్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉమాసంగమేశ్వర ఉత్సవాలు

పెద్దశంకరంపేట, మార్చి 10 : దక్షిణ కాశీగా పేరుగాంచిన కొప్పోల్ ఉమాసంగమేశ్వరాలయంలో ఆదివారం రాత్రి రథోత్సవం నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా రథంపై ఉమాసంగమేశ్వర విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చారు. జాతరలో ఉపవాస దీక్షలు, బండ్ల ఊరేగింపు, ఉమాసంగమేశ్వరుడి కల్యాణోత్సవం, రథోత్సవం ముగియడంతో భక్తులు తిరుగుముఖం పట్టారు.

శివాలయాల్లో కొనసాగుతున్న పూజలు

రాంపూర్‌లో బోనాల ఉత్సవాలు

చేగుంట, మార్చి 10 : చేగుంట, నార్సింగి మండలాల్లోని శివాలయాల వద్ద ఉత్సవాలు కొనసాగుతున్నాయి. చేగుంట మండలం ఉల్లితిమ్మాయిపల్లిలో రాజరాజేశ్వరి దేవాలయంలో ఆదివారం అన్నదానం ఏర్పాటు చేశారు. రాంపూర్ శివాలయంలో భక్తులు బోనాలు సమర్పించారు. బోనాల్ గ్రామంలో కొనసాగుతున్న మల్లన్న జాతరలో కాంగ్రెస్ నాయకుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో మాజీ సర్పంచ్ భాస్కర్, నాయకులు సాయికుమార్, బోయిని భూషణం, ప్రశాంత్, వడ్ల నవీన్, తాడెం వెంగళ్‌రావు, స్టాలిన్, నర్సింహులు, సంద్రుగు శ్రీకాంత్, సాయికుమార్‌గౌడ్, జూకంటి రాజుగౌడ్, అంజాగౌడ్, జగన్‌గౌడ్, హరిప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేటలో బోనాల ఊరేగింపు

వివాహిత అదృశ్యం

దీప్ మల్లా సూర్యవంశీ

మనోహరాబాద్, మార్చి 10 : వివాహిత అదృశ్యమైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాళ్లకల్‌లో జరిగింది. ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌లో ఆసిఫ్‌నగర్‌కు చెందిన మహ్మద్ యాసిన్ షేక్ ఏడాది క్రితం నాగ్‌పూర్‌కు చెందిన దీప్ మల్లా సూర్యవంశీని ప్రేమ వివాహం చేసుకున్నాడు. యాసిన్‌షేక్ భార్యతో కలిసి ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామిక వాడలోని పరిశ్రమలో పని చేస్తూ కాళ్లకల్ గ్రామంలో ఉంటున్నాడు. ఈ నెల 3న ఉదయం యాసిన్ డ్యూటీకి వెళ్లి, రాత్రి ఇంటికివచ్చేసరికి సూర్యవంశీ కనిపించలేదు. భార్యకోసం బంధువుల ఇండ్లతోపాటు హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఆ దివారం మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. యాసిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

నీటిలో వ్యక్తి గల్లంతు

నర్సాపూర్, మార్చి 10 : నీటిలో వ్యక్తి గల్లంతైన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దచింతకుంటలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పెద్దచింతకుంట గ్రామానికి చెందిన ముద్దం బాలేశ్ (43) గ్రామంలోని చెరువులో గేదెలకు నీళ్లు తాగించడానికి వెళ్లి అందులోనే పడిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు గజఈతగాళ్లతో చెరువులో గాలించారు. ఎస్సై పుష్పరాజ్ ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

గొర్లకాపరి మృతి

రామాయంపేట, మార్చి 10: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గొర్రెల కాపరి శ్రీనివాస్ హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో ఆదివారం మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అక్కన్నపేటకు చెందిన ముకిరె శ్రీనివాస్ (30) 10 రోజుల క్రితం మెదక్ శివారు నుంచి గొర్రెలు తీసుకొస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గొర్రెలు మృతి చెందాయి. శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలు కావడంతో మెదక్ ఏరియా దవాఖానకు, వెంటనే హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ దవాఖానకు తరలించారు. అక్కడ పది రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం పరిస్థితి విషమించడంతో శ్రీనివాస్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

నిజాంపేట, మార్చి 10 : మండలంలోని నస్కల్ ఎస్సీ కాలనీలో సీసీ డ్రైనేజీ పనులను ఆదివారం ఎంపీపీ సిద్ధిరాములు ప్రారంభించారు. డ్రైనేజీ నిర్మాణం అందుబాటులోకి వస్తే మురుగు నీటి సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు దుర్గయ్య, గ్రామస్తులు నగేశ్, సంజీవ్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311806-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గురుపాద గుట్టకు పూర్వవైభవం

- నేటి నుంచి పెద్దశంకరంపేటలో ఉత్సవాలు ప్రారంభం
- రేపు కల్యాణోత్సవం, ఎడ్లబండ్ల ఊరేగింపు

గురుపాదగుట్ట వద్ద నిర్మించిన శివాలయం, ఇన్‌సెట్‌లో ఆలయంలోని శివలింగం

పెద్దశంకరంపేట, మార్చి 10 : పెద్దశంకరంపేటకు సమీపంలో ఉన్న గురుపాద గుట్టమీదున్న శివాలయానికి పూర్వ వైభవం వచ్చింది. శిథిలావస్థలో ఉన్న ఆలయంలో 35 ఏండ్లుగా దూపదీప నైవేద్యాలకు నోచుకోలేదు. పట్టణానికి చెందిన ఆలయ ధరకర్త బలరాం సంగమేశ్వర్ ముందుకొచ్చి ఆలయాన్ని పునర్నిర్మించి పూర్వవైభవం తీసుకొస్తున్నారు. 35 ఏండ్ల తర్వాత శివరాత్రి ఉత్సవాలను జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నేడు(సోమ వారం) పుణ్యాహ వచనం, రుద్రాభిషేకం, ఆకు పూజ, అన్నపూజ, 12న పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం, బండ్ల ఊరేగింపు, అమ్మవారికి ఒడిబియ్యం సమర్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు తెలిపారు. పెద్దశంకరంపేట నుంచి రేగోడ్ వెళ్లే రహదారిలో పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో గురుపాదగుట్ట కమాన్ వద్ద దిగి, ఒక పర్లాంగ్ నడుచుకుంటూ వెళ్లాలి.

సావిత్రిబాయి ఆదర్శం

రామాయంపేట/ నిజాంపేట, మార్చి 10 : రామాయంపేట పట్టణంలో ఆదివారం సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతి నిర్వహించారు. సావిత్రిబాయిపూలే విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సావిత్రిబాయిపూలే మహిళలకు ఆదర్శమని, పూలే దంపతుల ఆశయాలను సాధిస్తామని ఎమ్మార్పీఎస్, బహుజన సంఘాల నాయకులు పేర్కొన్నారు.

నిజాంపేట మండలం నస్కల్‌లో సావిత్రిబాయి పూలే వర్ధంతిని డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సిద్ధిరాములు మాట్లాడారు. సావిత్రిబాయి పూలే భారత దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలని, స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. అనంతరం సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎల్లం, నగేశ్, లక్ష్మాగౌడ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి

పట్టాలు అందుకున్న చిన్నారులు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 10: విద్యార్థులకు చిన్నతనం నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ, శ్రద్ధ తదితర లక్షణాలు నేర్పుతూ ఉత్తములుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉన్నదని ప్రముఖ్ సైకాలజిస్ట్ సోనాల్ రవి అంద్రూస్, ఇట్రోడ్ సంస్థ నిర్వాహకుడు మధుకర్‌రెడ్డి, బిల్డింగ్ బ్లాక్ బుక్ పబ్లిషర్స్ నిర్వాహకుడు సాయికృష్ణ తెలిపారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని వెంకట్రావ్‌నగర్ కాలనీలో ఉన్న సిద్దార్థ్ పాఠశాలలో కిండర్ గార్టెన్ స్నాతకోత్సవాలు నిర్వహించారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు పట్టాలు అందజేసి, సత్కరించారు. ఈ సందర్భంగా సిద్దార్థ్ విద్యార్థులు, సిద్దార్థ్ విద్యాసంస్థల యాజమాన్యం అంధుల కోసం రూ. 7,77,777 ఆర్థికసాయాన్ని సోచ్ స్వచ్ఛంద సంస్థకు విరాళంగా అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిద్దార్థ్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, ప్రిన్సిపాల్ సంధ్యారాణి పాల్గొన్నారు.

నస్కల్‌లో తాగు నీటి కోసం తండ్లాట

నస్కల్‌లో ఖాళీ నీటి బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

నిజాంపేట, మార్చి 10 : మండలంలోని నస్కల్ ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సమీప పొలాల నుంచి బిందెలతో నీళ్లు తీసుకొచ్చుకుంటున్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో నీటి సమస్య ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. ఈ మేరకు మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు.

నిరుపేద క్రిస్టియన్లను ఆదుకుందాం


రీజియన్ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ అధ్యక్షుడు ఆకుల గోపాల్‌ను సన్మానిస్తున్న పాస్టర్లు

రామాయంపేట, మార్చి 10: పేద కుటుంబాలకు చెందిన క్రిస్టియన్లను ఆదుకోవాలని ఉత్తర తెలంగాణ పాస్టర్స్ డిక్లరేషన్ ప్రతినిధి ఎల్లం పిలుపునిచ్చారు. శనివారం రాత్రి రామాయంపేట రీజియన్ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీని ఎన్నుకున్నారు. రీజియన్ అధ్యక్షుడిగా ఆకుల గోపాల్, ఉపాధ్యక్షుడిగా బోయాజ్, ప్రధాన కార్యదర్శిగా థామస్, జాయింట్ సెక్రటరీగా ఆశీర్వాదం, ట్రెజరర్‌గా రత్నం, సభ్యులుగా రాజు, దేవరాజును ఎన్నుకున్నారు.

ప్రసాద్‌గౌడ్ సేవలు వెలకట్టలేనివి

గూడూరులో మహిళకు కుట్టుమిషన్ అందజేస్తున్న ప్రసాద్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

శివ్వంపేట, మార్చి 10: స్వర్గీయ జిన్నారం పెద్దగౌని ప్రసాద్‌గౌడ్ ప్రజలకు చేసిన సేవలు వెలకట్టలేనివని ప్రసాద్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్‌గౌడ్, ఎండీ రమణాగౌడ్ అన్నారు. ఆదివారం శివ్వంపేట మాజీ సర్పంచ్ ప్రసాద్‌గౌడ్ 20వ వర్ధంతి సందర్భంగా గూడురులో ఆయన విగ్రహానికి ఘన నివాళి అర్పించారు. వంజరి రేఖకు కుట్టుమిషన్, పక్షవాతంతో బాధపడుతున్న కొత్తపేట రవికి రూ. 15వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మీశ్రీనివాస్‌గౌడ్, ట్రస్టు సభ్యులు సూర్యంకుమార్ గౌడ్, జిల్లా రైతు రక్షణ సమితి గౌరవాధ్యక్షుడు మైసయ్యయాదవ్, కొత్తగొల్ల యాదయ్య, బాసంపల్లి పోచాగౌడ్, వంజరి కొండల్, బేగరి నర్సయ్య, నగేశ్, బీఆర్ఎస్ నాయకుడు మురళీ తదితరులు పాల్గొన్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు

- ట్యాంకర్లతో పంటలకు నీళ్లు
- పదేండ్లలో ఎప్పుడూ ఇట్లా లేదు
- ఆర్.వెంకటాపూర్ రైతుల ఆవేదన

ఆర్.వెంకటాపూర్‌లో ట్యాంకర్ ద్వారా పంటకు నీరు పడుతున్న రైతులు

రామాయంపేట, మార్చి 10: భూగర్భజలాలు తగ్గిపోయి బోర్లలో నీరు ఎండిపోవడంతో పొట్టదశలో ఉన్న వరి మడులకు ఆర్. వెంకటాపూర్ రైతులు ట్యాంకర్లతో నీళ్లు పెడుతున్నారు. మరో నెల రోజులు నీళ్లు పెడితేనే పంట చేతికొస్తదని వారు చెబుతున్నారు. పదేండ్ల నుంచి ఎలాంటి ఇబ్బంది లేకుండే.. బాయి కాడికి పోకున్నా పంటలు చేతికొచ్చినయ్. ఇప్పుడు మళ్లా కష్టాలు మొదలైనయ్ అంటూ ఆర్.వెంకటాపూర్ రైతులు కమ్మరి బాలరాజు, స్వామి ఆవేదన వ్యక్తంచేశారు. బోర్లలో నుంచి నీరు రాకపోవడంతో పంటలు ఎండి పోకుండా దూర ప్రాంతాల నుంచి ట్యాంకర్లతో నీళ్లు తెప్పించి వరి పంటకు నీళ్లు పడుతున్నామని చెబుతున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థులు ప్రతిభ

కరాటే చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న మెదక్ విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 10: జాతీయస్థాయి కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారని రెంజుకి షోటోకాన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నగేశ్ తెలిపారు. మనోహరాబాద్‌లోని సన్‌సైన్ షోటోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో రెండో జాతీయస్థాయి కరాటే పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర గోవా తదితర రాష్ట్రాల నుంచి సుమారు 1500 వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు. మెదక్ విద్యార్థులు వివిధ విభాగాల్లో 14 బంగారు, 2 రజత పతకాలు, పలు బెల్టులు సాధించినట్లు నగేష్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను కరాటే కోచ్ దినకర్ అభినందించారు.

మెదక్ చర్చిలో భక్తుల సందడి

భక్తులను ఆశీర్వదిస్తున్న చర్చి ప్రేసీబేటరీ ఇంచార్జి శాంతయ్య

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 10: మెదక్ చర్చికి రాష్ట్ర నలుమూలలతోపాటు పొరుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి భక్తులు, పర్యాటకులు ఆదివారం భారీగా తరలివచ్చారు. దీంతో చర్చి ప్రాంగణం కిటకిటలాడింది. ఈ సందర్భంగా చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులనుద్దేశించి దైవసందేశం వినిపించారు. యేసయ్య భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. ప్రార్థనల్లో చర్చి పాస్టర్లు డేవిడ్, శ్రీనివాస్, జైపాల్, సువర్ణ, కమిటీ సభ్యులు గంట సంపత్, జయరాజ్, సంశాన్ సందీప్, సువన్‌డగ్లస్, ప్రాంక్‌జాన్సన్, ప్రభుదాస్, దేవరాజ్, నోబుల్‌సన్ పాల్గొన్నారు.

ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మల్లన్న జాతరలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్


మల్లన్న ఉత్సవాల్లో పాల్గొన్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

మనోహరాబాద్, మార్చి 10 : మండలంలోని కాళ్లకల్‌లో మల్లన్న ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నవనీతా రవి ముదిరాజ్, శివ్వంపేట ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్‌ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తూప్రాన్‌లో పోలీసుల కవాతు

తూప్రాన్, మార్చి 10: డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో తూప్రాన్‌లో పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) బలగాలతో తూప్రాన్ పోలీస్‌స్టేషన్ నుంచి నర్సాపూర్ క్రాస్‌రోడ్ వరకు కవాతు నిర్వహించారు. కవాతులో ఎస్సై శివానందం, సీఐఎస్ఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.